క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం హర్షణీయం

తాడేపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ తాడేపల్లి మండల అధ్యక్షుడు వడ్డేశ్వరం తంబిబాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుల్లో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను కేబినేట్ ఆమోదించడం అభినందనీయన్నారు. దీంతో ఎస్సీల్లోని అన్ని ఉప కులాలకు మేలు జరిగేలా సమాన అవకాశాలు ఏర్పడతాయని, ఎన్నికల సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని అమలు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో 19వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించే ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని ఇంచార్జి ఎంపీడీవో రవిబాబు అన్నారు. 19, 20 తేదీల్లో తక్కళ్లపాడు, బేతపూడి సచివాలయం వద్ద అంగన్‌వాడీ సెంటర్‌లో, 21, 22 తేదీల్లో యర్రగుంట్లపాడు సచివాలయం, నుదురుపాడు అంగన్‌వాడీసెంటర్ వద్ద 25 నుంచి 28వరకు వేములూరిపాడు అంగన్‌వాడీ సెంటర్(ఉర్దూ), ఫిరంగిపురం-3 సచివాలయం వద్ద నిర్వహించే ఆధార్ క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మహిళా పోలీసు, సచివాలయ డీఏలు నాగరాజు, ఎం.అన్నా యవజశ్వ మాలికా, బి.శోభ, టి.రేణుక, బి.సుందరి, ఎస్.విజయభాస్కర్, బందామానస, టి.శ్రీలక్ష్మీలు పాల్గొంటారని చెప్పారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో నవగ్రహ హోమం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహప్రతిష్ఠ నిర్వహించి 41రోజులు అయిన సందర్భంగా బుధవారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే విశ్వేశ్వరుడికి నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించారు. విశ్వక్షేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన పూజలు చేశారు. వాస్తు హోమం, రుద్రహోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రకాష్‌నగర్‌లో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమాన్ని సీఐ కల్యాణ్‌రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ప్రజలు సామరస్యంగా ఉండాలని, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఎస్ఐ శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలుపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి



తాడికొండ: ఎస్సీ వర్గీకరణపై రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సహేతుకం కాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. తుళ్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేబినెట్ నిర్ణయానికి దళిత మంత్రులు మద్దతు తెలిపిన తీరు బాధాకరమన్నారు. వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకోకపోతే, అసెంబ్లీ, ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి చేస్తామని హెచ్చరించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్, తాడికొండ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దారా హేమప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం!

● శిథిలావస్థలో కాలువ వంతెన ● ఆరు దశాబ్దాల క్రితం నిర్మాణం
● ప్రమాదకరంగా మారిన వైనం ● తరచుగా ప్రమాదాలు

ఫిరంగిపురం: మండలకేంద్రం నుంచి సత్తెనపల్లి వెళ్లే రహదారిలో తక్కెళ్లపాడు గ్రామ సరిహద్దులో సాగర్ కెనాల్‌పై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనిని ఆరు దశాబ్దాల కిందట కాలువపై రాకపోకల కోసం నిర్మించారు. అప్పటినుంచి వాహనాల రాకపోకలకు దీనిని వినియోగిస్తున్నారు. సత్తెనపల్లి వెళ్లేందుకు దగ్గరిదారి కావడంతో ప్రతి రోజు అనేక వాహనాలు, ద్విచక్రవాహనాలు ఈ వంతెనపై నుంచి వెళుతుంటాయి.



దెబ్బతిని సైడ్ వాల్స్ లేకుండా ఉన్న కాలువ వంతెన

సైడు వాల్స్ లేక ఇక్కట్లు..

వంతెనకు ఇరువైపులా కాలువలోకి వాహనాలు వెళ్లకుండా రక్షణగా ఉండే ఇనుప సైడ్‌వాల్స్ పూర్తిగా విరిగిపోయాయి. దీంతో రాత్రిళ్లు, ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనాలు కాలువలోకి దూసుకెళుతూ వాహనచోదకులు మృత్యువాత లేదా గాయాలపాలవుతున్నారు.

పలు ప్రమాదాలు ..

వంతెనకు ఇరువైపులా సైడ్‌వాల్స్ లేకపోవడంతో రాత్రిళ్లు ఎన్నో ప్రమాదాలు జరిగాయి. వంతెన వద్ద రోడ్డు ఎత్తుగా ఉండటం, దగ్గరకు వచ్చేంతవరకు సరిగా దారి కన్పించకపోవడంతో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు కాలువలోకి దూసుకువెళ్లి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు మృతి చెందగా, మరికొందరు క్షతగాత్రులయ్యారు.

పట్టించుకోని అధికారులు..

ఈవంతెన వద్ద ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగినా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వంతెన పూర్తిగా దెబ్బతిన్నా దానికి మరమ్మతులు చేయడం కాని, సైడ్‌వాల్స్ నిర్మించడం కానీ చేయకపోవడంతో స్థానిక గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను పూర్తిగా తొలగించి, నూతన వంతెనకు పూనుకోవడం గానీ, మరమ్మతులు చేసి సైడ్‌వాల్స్ నిర్మించడం కానీ చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

● దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ అరుణను వివరణ కోరగా కాలువ వంతెన వద్ద ప్రమాదాలు జరుగుతున్నవి వాస్తవమేనన్నారు. నూతన వంతెన, రోడ్డు నిర్మాణం విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.

తరచూ ప్రమాదాలు..



వంతెనపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిళ్లు సైడు వాల్స్ కన్పించకపోవడంతో ద్విచక్రవాహనదారులు ఎందరో కాలువలో పడి గాయాల పాలయ్యారు. సైడు వాల్స్ నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి.

– ఎం.కొండారెడ్డి, తక్కెళ్లపాడు

పెద్ద ప్రమాదాలు జరక్కముందే మేల్కోవాలి..



కాలువపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. గతంలోను, ఇప్పుడు ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కాలువలో నీరు పారే సమయంలో ప్రమాదాలు జరిగి ఎందరో కొట్టుకుపోయిన సంఘటనలు ఇక్కడ జరిగాయి. పెద్ద ప్రమాదాలు జరక్కముందే అధికారులు మేల్కోవాలి.

– కిరణ్‌కుమార్ వెలుగూరి, తక్కెళ్లపాడు

డ్రోన్ నిఘాతో నేరాల నియంత్రణ

మంగళగిరి/మంగళగిరిటౌన్: డ్రోన్ల సహకారంతో అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్, ప్రమాదాల సమస్యలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నగర పరిధిలోని జాతీయ రహదారిపై డ్రోన్ సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ల నిఘాతో అసాంఘిక కార్యక్రమాలను సులభతరంగా అరికట్టవచ్చన్నారు. జనం రద్దీగా వుండే జాతీయ రహదారి వెంటనే బస్‌స్టేషన్లు, కూడళ్లులో డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక శక్తులను అరికట్టడమే లక్ష్యమన్నారు. అధిక రద్దీ వున్న ప్రాంతాలలో నిరంతరం డ్రోన్లతో నిఘా వుంటుందన్నారు. ఎస్ఐ సిహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు జాతీయ రహదారిపై డ్రోన్‌తో ట్రాఫిక్ రద్దీని పరిశీలిస్తున్న పోలీసులు

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి


మేడికొండూరు: మండలంలోని మందపాడు గ్రామంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర జరిగింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు అజయ్ కుమార్ పాల్గొన్నారు. మందపాడు గ్రామంలో దేవాలయ భూములు 90 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసే కౌలు రైతు కుటుంబాలు 80 వరకు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కౌలుకు పొలాలు సాగు చేస్తున్నప్పటికీ తమను గుర్తించి, ఇప్పటివరకు కౌలు రైతు గుర్తింపు కార్డులు గానీ, పంట రుణాలు గానీ, ప్రభుత్వం నుంచి సహాయం గానీ తమకు అందలేదని పలువురు రైతులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చే కౌలు చట్టాలకు లోబడి దేవదాయ, ధర్మాదాయ భూములు సాగు చేసే రైతులకు పంటల రుణాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. వారిలో సన్న కారు రైతులను గుర్తించి స్మాల్ ఫార్మర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలు రకాల డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావుకు అందజేశారు. కౌలుదారు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ, సాంబయ్య, కొరివి కృష్ణ, పలువురు కౌలు రైతులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు అజయ్ కుమార్, రామకృష్ణ

వీఐటీ ఏపీ- బీవీఆర్ సైయాంట్ మధ్య ఎంఓయూ

తాడికొండ: వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం, సీఎన్‌టీ ఫౌండేషన్, డాక్టర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (బీవీఆర్ సైయాంట్) మధ్య అవగాహన ఒప్పందం జరిగిందని వీఐటీ ఏపీ వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.సి.కోటారెడ్డి తెలిపారు. బుధవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ విద్యమెరుగు, బూట్ క్యాంప్‌లు, హ్యాకథాన్‌లు, మెంటర్ షిప్ ప్రోగ్రామ్‌లు, ఐటీ, ఉత్పత్తి నిర్వహణ, వర్క్‌షాపులు, అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వరుస సహకార కార్యక్రమాల ద్వారా ఆవిష్కరణ, వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నడుస్తున్నట్లు తెలిపారు. తమ వర్సిటీ సీఎన్‌టీ ఫౌండేషన్, బీవీఆర్ సైయాంట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఒప్పందం నూతన టెక్నాలజీ, ఆవిష్కరణలు రూపొందించడంలో సహాయ పడుతోందని తెలిపారు. బీవీఆర్‌సైయంట్ సీఈఓ డాక్టర్ సుధాకర్ పాటుకుషి మాట్లాడుతూ వీఐటీ ఏపీ వర్సిటీ భాగస్వామ్యంతో కొత్తరకం ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ప్రేరేపించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవస్థాపక ఆకాంక్షలు, సామర్థ్యం పెంచడానికి ఇది ఉపయోగపడుతోందన్నారు. ఐఐటీసీ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌పవన్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ పి.ఎస్.సి. నరసింహన్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న వీఐటీ ఏపీ, బీవీఆర్ సైయాంట్ ప్రతినిధులు

మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలి

మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్

తెనాలి టౌన్: మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అంగలకుదురు,చావావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పాల్గొని రైతులకు వ్యవసాయ సంబంధమైన పలు విషయాలు సూచించారు.మొక్కజొన్న పైరు కండె దశలో ఉన్నందున ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలోకండె విరిచేందుకు పంట సిద్ధమవుతున్నట్టు తెలిపారు. రైతులు మొక్కజొన్న పైరుకు చివరి తడిగా నీటిని పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న అనంతరం పచ్చిరొట్ట పైరు వేయడంవల్ల భూసారం వృద్ధి చెందుతుందని తెలిపారు.కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని సూచించారు. అపరాల సాగుగా మినుము,పెసర పైరు వేసిన రైతులు పంటను ప్రభుత్వానికి అమ్మదలచినచో గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.వేసవిలో అపరాల సాగు చేసినచో భూసారం వృద్ధిచెందుతుందని వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సాయి దీపిక,పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రేమ్‌సాగర్

కార్మికుల సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కొర్రపాటి ఆదినారాయణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించి, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అప్పుడు ఇచ్చిన హామీని నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాని, గురవయ్య, రమాదేవి, ఇమాంబి, సుబ్బారావు, శివమ్మ, నవనీతం, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా ధర్నా

మంగళగిరి: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ ఏఎన్ఎంల సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పది గంటలకు మహా ధర్నా నిర్వహించనున్నామని సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ లోని ఏపీఐబీసీ భవన్ రాష్ట్ర కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో సెక్రటరీలు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏపీపీగా రెంటపల్లి రాజేష్



మంగళగిరి టౌన్: మంగళగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రెంటపల్లి రాజేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీగా రాజేష్ మూడేళ్లపాటు విధులు నిర్వహించనున్నారు. తాడేపల్లి రూరల్ ఉండవల్లికి చెందిన రెంటపల్లి రాజేష్ గత 10 సంవత్సరాలుగా మంగళగిరి కోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. మంగళగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీగా నియమించడంతో పలువురు న్యాయవాదులు, నాయకులు రాజేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సర్వేలో లోపాలు నివారించండి



తెనాలిఅర్బన్: సర్వేలో ఎటువంటి లోపాలు దొర్లకుండా చూడాలని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగనాథ్ పేర్కొన్నారు. 16వ వార్డులో జరుగుతున్న ఎస్‌సీడీ సీడింగ్, హౌస్ హోల్డ్ సర్వేలను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేసే విధానాన్ని అడిగి తెసుకుని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులున్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్



తెనాలిరూరల్: పట్టణంలో పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పదో తరగతి పరీక్షలకు పట్టణంలో 11, రూరల్ ప్రాంతంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్, కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, డి ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలలకు కేటాయించిన పరీక్ష సిబ్బంది ద్వారా ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో పూర్తిస్థాయిలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబీ, పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: కార్యకర్తలే పార్టీకి బలం అని.. పార్టీ విజయం కోసం నిరంతరం కష్టపడి పనిచేయాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. నగర పరిధిలోని యర్రబాలెంలో మంగళవారం రాత్రి పార్టీ మంగళగిరి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ రూరల్ అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వేమారెడ్డి మాట్లాడుతూ ప్రతి పార్టీ కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. కార్యకర్తకు ఏ నష్టం, కష్టం వచ్చినా పార్టీ వెన్నంటే ఉందనే భరోసా ఇస్తుందన్నారు. పార్టీ నియోజకవర్గ కమిటీలతో గ్రామ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. అధికార పార్టీ మోసాలను ప్రజలలో తీసుకెళ్లి వారికి వివరించాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేంత వరకు ఏఒక్క కార్యకర్త, నాయకుడు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టెపోగు భూషణం, నియోజకవర్గ యూత్ కమిటీ అధ్యక్షుడు గౌస్, సీనియర్ నాయకులు బొమ్ము సాంబిరెడ్డి, చంద్రశేఖర్ దున్నా నాగయ్య, షఫీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దుదాం

తాడేపల్లిరూరల్/మంగళగిరి టౌన్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థను స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దుదామని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. బుధవారం స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి పట్టణ పరిధిలోని 4వ వార్డులో, తాడేపల్లి పట్టణ పరిధిలోని 2వ వార్డులో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. వార్డులలో చెత్త తొలగించడంతో పాటు డ్రైనేజీలలో పూడిక తీయించారు. రోడ్ల వెంబడి వున్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని సూచించారు. తడి పొడి చెత్తను వేరువేరుగా ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని అన్నారు. ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అదనపు కమిషన్ శకుంతల, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిలో నిర్వహించిన స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో పాల్గొన్న ఎంటీఎంసీ కమిషనర్

కేఎల్‌యూలో జాతీయ సదస్సు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో బీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ది డెవలప్‌మెంట్ మోడల్స్ ఆఫ్ అమరావతి అండ్ హైదరాబాద్ ఎ హిస్టారికల్ ఆస్పెక్ట్ అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షిల్లాంగ్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ శివాజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరప్పా నాగరికత కాలం నుంచి నేటి వరకు ప్రపంచ చరిత్రలో ఏ రాజధాని నగరాలు చూసినా నదీ తీరాలలోనే వృద్ధి చెందాయన్నారు. ఎలాంటి అభివృద్ధికైనా నీరే మూలాధారమని పేర్కొన్నారు. సమాజంలోని విద్య, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో అన్ని సర్వతోముఖాభివృద్ధి సాధిస్తే స్వర్ణాంధ్ర 2047 సాకారమవడం సులభమౌతుందని అన్నారు. కేఎల్‌యూ బీఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ నేటితరం యువత తమ జీవితాలకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకోవడానికి మార్గాలను అన్వేషించుకోవాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రజాపతి, డాక్టర్ ఆర్.సాయికుమార్, ఉప విభాగాధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, కాంపిటేటివ్ పరీక్షల శిక్షణ విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న షిల్లాంగ్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ శివాజీ

ఒమెగా క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

తాడికొండ: తాడికొండ రావిచెట్టు సెంటర్‌లో బుధవారం గుంటూరు ఒమెగా క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో క్యాన్సర్ సంబంధిత పరీక్షలు, మ్యామోగ్రామ్, బీపీ, షుగర్, తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. శిబిరంలో 58 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరికి వైద్య సలహాలు అందజేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మండల తహసీల్దారు మెహర్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఒమెగా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు ముందుకు రావాడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో సేవాభావంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి బృందాన్ని అభినందించారు. డెప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ధనేకుల హరిబాబు, బి.పట్టాభి రామయ్య, షేక్ రఫీ, వెంకటేశ్వరరావు, ఏసుబాబు, నాంచారయ్య, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

తెనాలి టౌన్: డ్వాక్రా మహిళలు వృత్తి నైపుణ్యం పై అవగాహన పెంపొందించుకోవాలని సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామం ఎలిమెంటరీ పాఠశాలలో జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా తరగతులు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సర్పంచ్ జయనాగలక్ష్మి పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుస్తులపై పెయింటింగ్,రంగుల వినియోగం, తయారీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జయనాగలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెనాలి జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో టై అండ్ డై కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు ఎంతో ఓర్పుతో మహిళలకు శిక్షణ ఇస్తున్నారని అభినందించారు.కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ M/s. Shriram Finance Ltd, Labbipet Branch, VJA, వారి [illegible] ...

[illegible] 17232/2024 (SRO-మంగళగిరి) [illegible] 7 రోజులలో Regd. Post with ack due ద్వారా [illegible] ... 347 [illegible] 14-618 [illegible] 38 [illegible] 50.00 [illegible] 37 [illegible]

ఇట్లు

Y.VIJAYA KUMAR, Advocate
#29-4-21, Near Lotus Land Mark, Santhi Nagar, VIJAYAWADA-3. ✆ 99490 77012